నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 14 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

వనపర్తి జిల్లా కేంద్రంలో అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో..

మరికల్‌లో రావణ దహనం

దేవరకద్ర రూరల్ : కౌకుంట్లలో అమ్మవారి ఊరేగింపులో చిన్నారుల నృత్యాలు

జోగుళాంబ ఆలయంలో నదీహారతిలో పాల్గొన్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

వైభవంగా విజయదశమి

- చెరువుల్లో అమ్మవారి విగ్రహాల నిమజ్జనం
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- శమీ వృక్షాల వద్ద ప్రత్యేక పూజలు
- కనులపండువగా రావణదహనం

హిందూ సంప్రదాయాల్లో విశిష్టమైన విజయదశమి పండుగను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ఊరూరా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను నవరాత్రులు పూజలు చేసిన అనంతరం పురవీధుల్లో ఊరేగించి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే పండుగ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామాలు, పట్టణాల్లో శమీ వృక్షాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల రావణదహనాన్ని కనులపండువగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో చేపట్టిన వేడుకలు ఆద్యంతం అలరించాయి.

- మహబూబ్‌నగర్ నెట్‌వర్క్, అక్టోబర్ 13

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఘనంగా దసరా వేడుకలు

త్రినేత్రికి తెప్పోత్సవం

- పులకించిన నదీమతల్లి
- నేత్రానందం.. ఆదిదంపతుల జలవిహారం

అలంపూర్, అక్టోబర్ 13 : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగన్మాత, సప్తలో కల పరిపాలకురాలు అయిన త్రినేత్రికి విజయదశమి సందర్భంగా శనివారం తుంగభద్ర నదిలో అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఆదిదంపతులు హంసవాహనంపై చేసిన జల విహారం (తెప్పోత్సవం)తో నదీమతల్లి పులకించిపోయింది. ఉదయం ఆలయంలో మహా పూర్ణాహుతి, అవభృత స్నానం, సాయంత్రం శమీ పూజ మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే విజయుడు, ఐజీ రమేశ్‌రెడ్డి, డీజీపీ జితేంద్ర, ఎస్పీ శ్రీనివాసరావు దంపతులు ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉత్సవాల ముగింపు జోగుళాంబబాలబ్రహ్మేశ్వరుల ఉత్సవ మూర్తులకు ఆలయ సమీపంలోని నాగకన్యల బావిలో చక్ర స్నానం నిర్వహించారు. ఆలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య తీసుకొచ్చి చక్ర స్నానం నిర్వహించిన అనంతరం మళ్లీ ఆలయానికి చేరుకున్నారు.

నదీ హారతి..

తెప్పోత్సవానికి ముందు నదీతీరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో అర్చకులు నదీహారతిని ఘనంగా నిర్వహించారు. కుంభ, రథ, నక్షత్ర హారతి అంటూ నదీమ తల్లికి దశవిధ హారతులను సమర్పించారు. నదికి హారతి ఇవ్వడం అంటే సకల దేవతలను ఏకకాలంలో స్మరించిట్లేనని పండితులు పేర్కొన్నారు.

అనంతరం జోగుళాంబ ఆలయంలో ధ్వజావరోహణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళా కారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఉత్సవాలకు సహకరించిన కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు, ఆయా శాఖల అధికారులకు ఆలయ పాలక మండలి చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈవో పురేందర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

జలవిహారం చేస్తున్న ఆదిదంపతులు

శాసనమండలిలో బీఆర్ఎస్ సభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టిన మధుసూదనాచారిని కలిసి అభినందనలు తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్ రెడ్డి, సురభి వాణీదేవి

దసరాకూ రైతు భరోసా రాలే..

- దీపావళి నాటికైనా ఇచ్చిన హామీలు నేరవేరుస్తారా..?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్, అక్టోబర్ 13 : ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ బూటకమేనని, అమలు కాని వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ దసరా నాటికి రైతు భరోసా ఇస్తామని మొండి చేయి చూపించిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కనీసం దీపావళి నాటికైనా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేస్తారో లేదో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీ చేస్తామని ప్రకటించిందన్నారు. కానీ, ఇప్పటివరకు తూతూ మంత్రంగా 33 శాతం మంది రైతులకు మాత్రమే చేసిందని, మిగతా 67 శాతం రైతులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతులపై ఏమాత్రం ప్రేమలేదని, రైతు భరోసాను దసరా నాటికి అమలు చేస్తామని చెప్పినా దాని ఊసే ఎత్తడం లేదన్నారు. కనీసం దీపావళి వరకు రుణమాఫీ, రైతు భరోసానుఇస్తారా ఇవ్వరా రైతులకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుందని అన్నారు. రేవంత్‌రెడ్డికి రైతులు, మహిళలపై మక్కువ ఉంటే హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఛీకొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటి ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు సలీం, మద్దూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు తిరుపతి, శేఖర్, రాములు, బుగ్గప్ప, పీర్‌అహ్మద్, హబీబ్, కొత్తూర్ రాజారెడ్డి, సాయిలు, రాములు, మహిపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

చావులోనూ వీడని బంధం

- అన్నదమ్ములను కబలించిన నీటిగుంత
- స్ఫూర్తితండాలో విషాదం

సాయినాయక్, సాకేత్‌నాయక్ (ఫైల్)

మూసాపేట, అక్టోబర్ 13 : ఇంటి వద్ద ఉన్నా.. ఆటలాడుకున్నా.. పొలం వద్దకు అయినా అన్నదమ్ములు కలిసి వెళ్లేవారు. ఇలా వారి బంధం చావులోనూ వీడలేదు. అన్నదమ్ములను ఓ నీటి గుంత కబలించింది. అందరి ఇండ్లలో దసరా పండుగ సంబురాల్లో ఉంటే ఓ కుటుంబంలో విషాదం నెలకొన్నది. వివరాల్లోకి వెళ్తే.. మూసాపేట మండలంలోని స్ఫూర్తితండాకు చెందిన సక్రూ నాయక్, జ్యోతిలకు ఇద్దరూ కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వారిలో సాయినాయక్ (13) 8వ తరగతి చదువుతుండగా, మరో కుమారుడు సాకేత్‌నాయక్(9) 5వ తరగతి చదువుతున్నాడు. అయితే విజయదశమి వేడుకల్లో అందరూ ఉండగా శనివారం సాయంత్రం వారి వ్యవసాయ పొలం వద్దకు సాయి, సాకేత్‌లు వెళ్లారు. ఎంత సమయానికి వారు తిరిగి రాకపోవడంతో తండ్రి సక్రూ నాయక్ వారిని వెతుకుతూ పొలం వద్దకు వెళ్లారు. పొలం వద్ద వారు లేకపోవడంతో తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఉన్న వ్యవసాయ పొలంలో ఉన్న పాం పండ్ నీటి గుంతవైపు చూడడంతో కట్టపై పిల్లల చెప్పులు, వారు తీసుకెళ్లిన కవర్ కనిపించడంతో అనుమానంతో నీటి గుంతలో వెతికారు. దీంతో ఒకరు కని పించడంతో అతన్ని బయటకు తీసి, మళ్లీ వెతకడంతో మరొకరు లభ్యమైనట్లు తెలిపారు. వారిని బతికించుకుందామని కారులో జిల్లా దవాఖానకు తరలించారు. కానీ వైద్యులు వారు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో ఉన్న ఇద్దరూ కుమారులు కళ్ల ముందు విగత జీవులై పడిఉండడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వారి రోధనలు చూసి తండావాసులంతా కంటతడి పెట్టారు అప్పటి వరకు ఆడుతూ పాడుతూ ఉన్న ఇద్దరూ మృతి చెందడంతో స్ఫూర్తితండాలో విషాదం నెలకొన్నది. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- కేఎల్ఐ కాల్వలోకి దూసుకెళ్లిన ఆటో
- మంతటి గ్రామానికి చెందిన మహిళ మృతి

కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాలీ ఆటో

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 13 : అతివేగంతో వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడి ఓ మహిళ మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ శివారులోని జ్ఞాన సరస్వతీ ఆలయం వద్ద ఆదివారం చోటు చేసుకున్నది. మండలంలోని మంతటి గ్రామానికి చెందిన ట్రాలీ ఆటోలో అదే గ్రామానికి చెందిన 13 మంది కూలీలను పత్తి తీసేందుకు తరలిస్తున్నారు. ఈక్రమంలో ఆటో ఆలయం సమీపంలోకి రాగానే అదుపు తప్పి ఆలయ ముందు భాగంగా ఉన్న కల్వర్టు వద్ద కాల్వలోకి పల్టీ కొట్టింది. దీంతో అదే గ్రామానికి చెందిన ఫాతిమా బేగం (38) అక్కడికక్కడే మృతి చెందగా, మరో 12 మంది కూలీలు, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108లో వారిని నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. దవాఖానలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

విద్యుత్‌శాఖలో భారీగా బదిలీలు

ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఈ రమేశ్

- పండుగ పూట 166 మందికి ఉత్తర్వులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 13 : సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్-తెలంగాణ (ఎస్‌పీడీసీఎల్) మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో పండుగ పూట భారీగా బదిలీలు జరిగాయి. సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) పీవీ రమేశ్, ఆయా డివిజన్ల అధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో మొత్తం 166మందికి బదిలీలు చోటు చేసుకోవడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది తమకు కేటాయించిన పోస్టుల్లో రిపోర్టు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. పండుగ పూట బదిలీలు చోటు చేసుకోవడంతో ఎటూ పాలు పోకుండా ఉన్నామని పలువురు వాపోయారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి కావాల్సిన ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగులు తెలిపారు.

16వ తేదీలోపు రిపోర్టు చేయాలి..

ఒకే చోట రెండేండ్లకు పైబడి పని చేసిన వారికే బదిలీ అవకాశం ఇచ్చారు. కాగా మొత్తం ఉద్యోగుల్లో 50శాతం మాత్రమే బదిలీ చేశారు. కేటాయించిన స్థానాల్లో ఈ నెల 16వ తేదీలోపు రిపోర్టు చేయాలని అధికారులు అంటుండటం పండుగ పూట ఇబ్బందులు పాల్జేయడమే అవుతుందని కొందరు వాపోతున్నారు. శని, ఆదివారాలు పండుగ రోజులు కావడం, మిగిలిన రెండు రోజుల్లోనే తాము కేటాయించిన చోట రిపోర్టు ఎలా చేయాలంటున్నారు. ఇదిలా ఉండగా బదిలీల్లో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వకుండా.. కొన్ని సంఘాల ప్రతినిధులకే వత్తాసు పలికారంటూ కొందరు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా బదిలీలు జరిగాయని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా డీఈలు, ఏడీఈలు, ఏఈలతో పాటు వివిధ క్యాడర్‌లో బదిలీలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ పలువురు ఏడీఈలు, ఏఈలకు పదోన్నతులు వరించడంతోపాటు బదిలీలు జరిగాయి. డివిజన్లు, సర్కిల్ పరిధిలో కేటగిరీల వారీగా బదిలీలు ఇలా..

మహబూబ్‌నగర్ డివిజన్ పరిధిలో.. 11 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, 30మంది లైన్‌మెన్లు, ఏడుగురు అసిస్టెంట్ లైన్‌మెన్లు బదిలీ అయ్యారు.

జడ్చర్ల డివిజన్ పరిధిలో తొమ్మిది మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, 21 మంది లైన్‌మెన్లు, ఒకరు అసిస్టెంట్ లైన్‌మెన్, జేఎల్ఎంలు ముగ్గురు బదిలీ అయ్యారు.

మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలోని జడ్చర్ల, మహబూబ్‌నగర్ డివిజన్లలో పరిపాలన విభాగంలో పని చేస్తున్న 17 మంది సబ్ ఇంజినీర్లు, 11మంది జేఏవోలు, ఫోర్‌మెన్ గ్రేడ్-1 ముగ్గురు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నలుగురు, 16 సీనియర్ అసిస్టెంట్లు, 26 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఒక టైపిస్టు, ఆరుగురు ఆఫీస్ సబార్డినేటర్లు, బదిలీ అయ్యారు.

కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

స్వగ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- దసరా వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

వంగూరు, అక్టోబర్ 13 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్వగ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో దసరా పండుగను శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.40 లక్షలతో చేపట్టిన పశువైద్యశాల, బీసీ కమ్యూనిటీ హాల్ (రూ.58 లక్షలు), అమరజవాన్ యాదయ్య స్మారక గ్రంథాలయ భవనం (రూ. 55 లక్షలు), గ్రామ పంచాయతీ భవనం (రూ.72 లక్షలు)ను సీఎం ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, మురుగునీటి శుద్ధికేంద్రం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.18 కోట్లతో చేపటనున్న పనులకు శంకుస్థాపన చేశారు. రూ.64 లక్షలతో అత్యాధునిక ప్రయాణ ప్రాంగణ నిర్మాణం, ప్రధాన రహదారి మీదుగా విద్యుద్దీపాల అలంకరణ పనులు, రూ.32 లక్షలతో నిర్మించే చిల్డ్రన్ పార్క్, బహిరంగ వ్యాయామ శాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనం ముందు మామిడి మొక్కలు నాటారు. అక్కడి నుంచి హనుమాన్ ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. సాయంత్రం బతుకమ్మ ఆటా పాటలతో ర్యాలీగా వెళ్లి గ్రామ శివారులో శమీ వృక్షానికి మనువడితో కలిసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ సమీపంలో వ్యవసాయ పొలాల మధ్య కనిపించిన ఇంద్రధనస్సు

ఆకాశంలో ఆశల హరివిల్లు..

విజయదశమి రోజున శనివారం సాయంత్రం మక్తల్ పట్టణంతోపాటు మండలంలో వర్షం కురిసింది. ఆ సమయంలో ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనస్సు ఎంతో అద్భుతంగా ఉన్నది. పండుగ రోజు చూడడం ఆనందంగా ఉందని ప్రజలు చర్చించుకున్నారు. *- మక్తల్, అక్టోబర్ 13*

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

అయిజ, అక్టోబర్ 13 : కర్ణాటకలోని ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణా, తుంగభద్ర నదులకు వరద కొనసాగుతున్నది. ఆదివారం తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 84,504 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 82,968 క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.656 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1631.97 అడుగులు ఉంది. ఆర్డీఎస్ ఆనకట్టకు భారీ వరద చేరుతున్నది. ఇన్‌ఫ్లో 63,579, అవుట్ ఫ్లో 63 వేల క్యూసెక్కులుగా నమోదైంది. ఆయకట్టుకు 579 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 12.6 అడుగుల మేరకు నీటి మట్టం ఉంది.

ఆల్మట్టి, నారాయణపూర్‌లకు..

ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 35,575, అవుట్ ఫ్లో 40,460 క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ఠస్థాయి నీటి నిల్వ 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 127.83 టీఎంసీల నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 59,941, అవుట్‌ఫ్లో 60,900 క్యూసెక్కులుగా ఉన్నది. గరిష్ఠస్థాయి నీటి నిల్వ 37.40 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.56 టీఎంసీల నిల్వ ఉన్నది.